# సాక్షి విశాఖపట్నం

మంగళవారం । 5 । నవంబర్ । 2024




## గాల్లో వలంటీర్లు

పభుత్వ సేవలను ప్రజలకు చేరువచేయడం లో కీలకంగా వ్యవహరించిన వలంటీర్ల భవిష్యత్తు అగమ్యగోచరంగా మారింది. 8లో



## సమ్మోహనం..శ్రీ కృష్ణ లీలలు

నటరాజ్ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ వార్షికోత్సవం సందర్భంగా కూచిపూడి నృత్య నాటకం సమ్మోహనంగా సాగింది. 8లో



## ఉత్సాహంగా నెట్‌బాల్ పోటీలు

ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో బాల, బాలికలకు ఉమ్మడి విశాఖ జిల్లా నెట్‌బాల్ పోటీలు సోమవారం ఉత్సాహంగా జరిగాయి. 8లో

## న్యూస్‌రీల్

### ఎస్ఆర్ పురంలో మాల్దీవుల బృందం పర్యటన



ఎస్ఆర్ పురం ఆర్బీకే వద్ద మాల్దీవుల బృందం, ప్రజాప్రతినిధులు, అధికారులు

**పెందుర్తి:** మండలంలోని సౌభాగ్యరాయపురం (ఎస్ఆర్‌పురం)లో మాల్దీవుల బృందం సోమవారం పర్యటించింది. జిల్లా గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో ప్రజలకు అందుతున్న సేవల గురించి తెలుసుకునేందుకు వీరు పర్యటించారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన గ్రామ సచివాలయాన్ని సందర్శించి అక్కడ ప్రజలకు అందుతున్న సేవల గురించి ఆరా తీశారు. రైతు భరోసా కేంద్రం(ఆర్బీకే)లో రైతుకు అందుతున్న సేవలు, వాటి అమలు గురించి తెలుసుకున్నారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని సందర్శించారు. డీపీవో శ్రీనివాసరావు, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారులు అప్పలరాజు, శిరీష, గ్రామీణాభివృద్ధి సంస్థ ఉత్తరాంధ్ర కన్వీనర్ నాగరాజు, ఎంపీపీ మధుపాడ నాగమణి, సర్పంచ్ దూది విజయలక్ష్మి, ఇన్‌చార్జి ఎంపీడీవో వెంకటరావు పాల్గొన్నారు.

**మహారాణిపేట:** కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్‌తో భేటీ అయిన మాల్దీవుల ప్రజాప్రతినిధులు జిల్లా పర్యటనలో గుర్తించిన అంశాలపై అభిప్రాయాలను వెల్లడించారు. జిల్లాలోని పరిపాలనాపరమైన అంశాలు, విధానాలు, పద్ధతుల గురించి మాల్దీవుల ప్రజాప్రతినిధులకు కలెక్టర్ వివరించారు.

### కంబాలకొండలో బోటింగ్



బోటింగ్ చేస్తున్న సందర్శకులు

**ఆరిలోవ:** కంబాలకొండలో బోటింగ్ అందుబాటులోకి వచ్చింది. వేసవి ఎండలకు ఇక్కడి కొలనులో నీరు ఎండిపోయింది. దీంతో సుమారు నాలుగు నెలలు పాటు బోటింగ్ నిలిచిపోయింది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కొండల నుంచి వచ్చిన వరద నీటితో కొలను నిండింది. దీంతో నిర్వాహకులు మళ్లీ బోటింగ్‌కు ఏర్పాట్లు చేశారు. సాధారణంగా కార్తీక మాసం వచ్చిందంటే పిక్నిక్ ప్రియులకు కంబాలకొండ గుర్తుకు వస్తుంది. ఇప్పుడు సందర్శకులకు బోటింగ్ మరింత ఉల్లాసాన్ని పెంచనుంది. ప్రస్తుతం 12 కయాకింగ్ బోట్లు, 3 ఫ్యామిలీ బోట్లు(పెద్దవి), 2 రౌండ్ బోట్లు ఉన్నాయి. కయాక్స్ బోటులో ఇద్దరు, ఫ్యామిలీ బోటు, రౌండ్ బోటులో నలుగురు నుంచి ఐదుగురు వెళ్లవచ్చు. ఈ బోట్లలో సుమారు అరగంట సమయం కొలను అంతా చుట్టి రావచ్చు. దీనికి రూ.200 టిక్కెట్ రుసుముగా చెల్లించాలి.

### 22న కారుణ్య నియామక ప్రత్యేక అదాలత్

**తాటిచెట్లపాలెం :** ఈస్ట్ కోస్ట్ రైల్వే వాల్తేర్ డివిజన్ పరిధిలో కారుణ్య నియామకాల కోసం ఈ నెల 22వ తేదీన ప్రత్యేక అదాలత్ నిర్వహిస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు. డీఆర్ఎం కార్యాలయం ప్రాంగణంలో ఆ రోజు సాయంత్రం 4 నుంచి 6 వరకు అదాలత్ జరుగుతుందన్నారు. రైల్వేలో పనిచేస్తూ మరణించిన ఉద్యోగస్తుల కుటుంబ సభ్యులు దరఖాస్తులను డీఆర్ఎం కార్యాలయంలో ఈ నెల 18వ తేదీలోగా అందజేయాలని సూచించారు.

### విశాఖపట్నం-దానాపూర్ మధ్య స్పెషల్ రైలు

**తాటిచెట్లపాలెం:** ప్రయాణికుల రద్దీ దృష్ట్యా విశాఖపట్నం-దానాపూర్-విశాఖపట్నం మధ్య స్పెషల్ రైళ్లు నడుపుతున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం సందీప్ తెలిపారు. విశాఖపట్నం-దానాపూర్(08520) స్పెషల్ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 8వ తేదీ 9.10 గంటలకు బయల్దేరి మరుసటిరోజు ఉదయం 11 గంటలకు దానాపూర్ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో దానాపూర్-విశాఖపట్నం(08519) స్పెషల్ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 9వ తేదీ శనివారం మధ్యాహ్నం 12.30 గంటలకు బయల్దేరి మరుసటిరోజు ఆదివారం మధ్యాహ్నం 3.45 గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది.

### 10న డీఎస్సీ ఉచిత శిక్షణకు స్క్రీనింగ్ టెస్ట్

**ఎంవీపీకాలనీ:** డీఎస్సీ ఉచిత శిక్షణ పొందగోరే అభ్యర్థుల ఎంపికలో భాగంగా దరఖాస్తుదారులకు ఈ నెల 10న స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహించనున్నట్లు జిల్లా సాంఘిక సంక్షేమశాఖ డీడీ రామారావు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహణలో భాగంగా విశాఖలో 10 సెంటర్లలో ఈ టెస్ట్ జరగనున్నట్లు డీడీ వెల్లడించారు. స్క్రీనింగ్ టెస్ట్ హాల్‌టికెట్లను ఈ నెల 6 నుంచి పొందవచ్చన్నారు. విశాఖ జిల్లాలో 100 మంది వరకు అభ్యర్థులను ఈ ఉచిత శిక్షణ కోసం ఎంపిక చేయనున్నట్లు తెలిపారు.

## నమామి శివం సదా



ఎంవీపీ కాలనీ సెక్టార్–6 పార్వతీ ముక్తేశ్వర ఆలయంలో శివలింగాలకు అభిషేకాలు చేస్తున్న భక్తులు



శివయ్యకు మా మొర చేర్చవయ్యా..





- ఘనంగా తొలి సోమవారం పూజలు
- శివాలయాలకు పోటెత్తిన భక్తులు

శివనామ స్మరణతో శైవక్షేత్రాలు మార్మోగాయి. కార్తీకమాసం తొలి సోమవారం సందర్భంగా ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. తెల్లవారుజాము నుంచే భక్తులు శివాలయాలకు భారీగా చేరుకుని రుద్రాభిషేకం, పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. పెద్దసంఖ్యలో కార్తీక దీపాలను వెలిగించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. క్యూలో ఉన్న భక్తులకు తాగునీరు, ప్రసాదం అందజేశారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం





ద్వారకానగర్ రామలింగేశ్వరస్వామి ఆలయంలో దీపారాధనలో పాల్గొన్న మహిళలు



లయకారుడికి ప్రత్యేక పూజలు

# విశాఖ నుంచి ఆర్‌బీఐ ఔట్!



- విజయవాడలో ఏర్పాటుకు నిర్ణయం
- వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో వైజాగ్‌లో భవనాన్వేషణ
- 500 మంది ఉద్యోగులతో ప్రాంతీయ కార్యాలయం ఏర్పాటుకు నిర్ణయం
- 35 వేల చ.అడుగుల భవన ఎంపికకు తుది అడుగులు
- ప్రభుత్వం మారిన తర్వాత పట్టించుకోని చంద్రబాబు
- చివరికి విజయవాడలో ఏర్పాటు చేయాలని ఒత్తిడి తీసుకొచ్చిన కూటమి ప్రభుత్వం
- విజయవాడలో అద్దె భవనం కావాలంటూ టెండర్ నోటిఫికేషన్ జారీ

**సాక్షి, విశాఖపట్నం :** ఆర్థిక రాజధానిగా విశాఖను అభివృద్ధి చేస్తానంటూ దశాబ్దాలుగా బాకా కొట్టిన చంద్రబాబు.. ఇప్పుడు ఇక్కడ ఏర్పాటు కానున్న రిజర్వ్ బ్యాంక్‌ను మాత్రం తరిమేశారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) తన ప్రాంతీయ కార్యాలయాన్ని విశాఖలో ఏర్పాటు చేయాలని భావించి.. భవన అన్వేషణ ప్రక్రియ ప్రారంభించింది. ఇక ఆర్‌బీఐ ఏర్పాటు లాంఛనమే అన్న తరుణంలో ప్రభుత్వం మారిపోయింది. తర్వాత వచ్చిన కూటమి ప్రభుత్వం దీని గురించి పట్టించుకోలేదు. సేవలు ప్రారంభించేందుకు సమాయత్తమవుతున్న నేపథ్యంలో ఆర్‌బీఐని విజయవాడలో ఏర్పాటు చేసేలా కేంద్రంపై చంద్రబాబు ఒత్తిడి తీసుకొచ్చారు. ఈ నేపథ్యంలో రీజనల్ కార్యాలయ ఏర్పాటుకు అద్దె భవనం కావాలంటూ ఆర్‌బీఐ టెండర్లు ఆహ్వానించింది. ఎన్నికల ముందు విశాఖపై అలవిమాలిన ప్రేమ కురిపించిన చంద్రబాబు, పవన్.. ఇప్పుడు అన్ని రంగాల్నీ ఇక్కడ నుంచి దూరం చేసేందుకు కుట్ర పన్నుతున్నారనడానికి ఇదో ప్రత్యక్ష ఉదాహరణ. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తమ కార్యకలాపాలను హైదరాబాద్‌లోని రిజర్వ్ బ్యాంక్ కార్యాలయం నుంచే సాగించారు. రాష్ట్ర ఆర్థిక శాఖ నిర్వహించే సమావేశాలకు హైదరాబాద్ నుంచే అధికారులు విజయవాడకు వచ్చేవారు. దీనివల్ల పరిపాలన సౌలభ్యం కష్టసాధ్యమవుతుందని భావించి.. ఏపీకి ప్రత్యేక రీజనల్ కార్యాలయం ఏర్పాటు చేయాలని ఆర్‌బీఐ ఉన్నతాధికారులు 2023లో ఆదేశాలు జారీ చేశారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో కీలక నగరంగా ఉన్న విశాఖపట్నం వైపు అధికారులు మొగ్గు చూపారు.

### 500 మంది ఉద్యోగులతో...

రీజనల్ ఆఫీస్ ఏర్పాటు చేసేందుకు నగర పరిధిలో దాదాపు 30 వేల చ.అడుగుల విస్తీర్ణం ఉన్న భవనం అవసరమని అప్పటి జిల్లా కలెక్టర్‌తో సంప్రదింపులు జరిపారు. 500 మంది ఉద్యోగులతో ప్రాంతీయ కార్యాలయ ఏర్పాటుకు అవసరమైన ప్రాంతం కావాలని ప్రతిపాదించారు. కార్యాలయ నిర్మాణానికి ఏపీఐఐసీకి చెందిన స్థలం సిద్ధంగా ఉందని సూచించినా.. వెనువెంటనే కార్యాకలాపాలు ప్రారంభించాలని.. అందుకే నిర్మాణం పూర్తయిన భవనమే అవసరమని ఆర్‌బీఐ అధికారులు స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో నగరంలో మధురవాడ, రుషికొండ, ఆరిలోవ, కొమ్మాది, భీమిలి, హనుమంతువాక, కైలాసగిరి, సాగర్‌నగర్ పరిధిలోని పలు భవనాలను పరిశీలించారు. చివరికి ఎంవీపీ కాలనీ, సీతమ్మధార, మధురవాడ ప్రాంతాల్లో భవనాలను ఈ ఏడాది జనవరిలో ఎంపిక చేశారు. ఉన్నతాధికారులు పరిశీలించిన అనంతరం మూడింటిలో ఒక భవనాన్ని ఎంపిక చేసి కార్యకలాపాలు ప్రారంభించేందుకు ఆర్‌బీఐ సమాయత్తమైంది. ఇంతలో ఎన్నికలు రావడం.. ప్రభుత్వం మారిపోవడం చకచకా జరిగిపోయాయి.

### విశాఖ వెళ్లేందుకు వీల్లేదు..

కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత కూడా ఆర్‌బీఐ ఏర్పాటుకు విశాఖ అనుకూలమని అధికారులు భావించారు. దీనిపై రిజర్వ్ బ్యాంకు అధికారులు కసరత్తు ప్రారంభించారు. విషయం తెలుసుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబు.. ఎట్టిపరిస్థితుల్లోనూ రిజర్వ్ బ్యాంక్ విశాఖలో ఏర్పాటు కాకూడదని పట్టుబట్టినట్లు తెలుస్తోంది. దీనిపై కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖతో సంప్రదింపులు జరిపారు. విజయవాడలోనే ఆర్‌బీఐ రీజనల్ కార్యాలయం ఏర్పాటు చెయ్యాలని విశాఖ వెళ్లేందుకు వీల్లేదని కరాఖండిగా చెప్పినట్లు సమాచారం. దీంతో విశాఖలో రీజనల్ కార్యాలయం ఏర్పాటుకు ఆర్‌బీఐ బ్రేక్ వేసింది. చేసేది లేక విజయవాడలోనే ప్రాంతీయ కార్యాలయం ఏర్పాటు చేసేందుకు అవసరమైన ఏర్పాట్లు చేసుకుంటోంది. ఇందులో భాగంగానే ఏపీ రీజనల్ కార్యాలయం(ఏపీఆర్‌వో) ఏర్పాటు చేసేందుకు అవసరమైన 20 వేల నుంచి 28 వేల చ.అడుగుల విస్తీర్ణం గల అద్దె భవనం కావాలంటూ టెండర్ నోటిఫికేషన్‌ను ఆదివారం జారీ చేసింది. ఈ నెల 25లోపు టెండర్లు దాఖలు చేసుకోవాలంటూ షరతులు విధిస్తూ అన్వేషణ ప్రారంభించింది. దీంతో విశాఖ నుంచి ఆర్‌బీఐ రీజనల్ కార్యాలయం అవుట్ అయిపోయినట్లేనని స్పష్టమైపోయింది. ఓవైపు ఆర్థిక రాజధానిగా విశాఖని తీర్చిదిద్దుతానంటూ మైక్ దొరికిన చోటల్లా ఊదరగొట్టిన చంద్రబాబు చివరికి విషమంతా కక్కుతూ ఆర్థిక అవసరాలు తీర్చే ఆర్‌బీఐని వైజాగ్‌కు రాకుండా చేయడంపై నగర ప్రజలు, వాణిజ్య వేత్తలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మొత్తంగా ఒక్కో సంస్థను విశాఖ నుంచి దూరం చేసి ఒంటరి నగరంగా మార్చేందుకు జరుగుతున్న కుట్రలో భాగంగా.. ఆర్‌బీఐ తరలింపు మొదటి అడుగని అంతా భావిస్తూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## ఆన్‌లైన్ బెట్టింగ్ కేసులో మరో 16 మంది అరెస్ట్

**అల్లిపురం :** ఆన్‌లైన్ బెట్టింగ్ పేరుతో అమాయకులను మోసం చేస్తున్న మరో 16 మందిని సోమవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి తెలిపారు. ఇల్లీగల్ పేమెంట్ గేట్‌వే కేసులో వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో నిర్వహిస్తున్న కాల్ సెంటర్ నిర్వాహకులను అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే. తదుపరి విచారణలో సాయిరామ్, సూర్య మోహన్ (పరారీలో ఉన్నాడు), గిరీష్‌లు సైబర్ నేరాలకు ఉపయోగించిన 1,258 సేవింగ్, కరెంట్ అకౌంట్‌లు విశాఖపట్నంలో పలు బ్యాంకులలో తెరవబడినవే అని పోలీసులు నిర్ధారించారు. ఆ అకౌంట్లను తనిఖీ చేయగా.. వాటిలో కోట్ల లావాదేవీలు జరిగినట్లు గుర్తించారు. ఇందులో భాగంగా ఫేక్ ఫర్మ్ అకౌంట్లు, సేవింగ్ అకౌంట్లు సప్లయ్ చేసిన ఐదుగురు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు తెలిపారు. గిరీష్ నిర్వహిస్తున్న లక్కీ కిస్మత్ అనే మరో ఆన్‌లైన్ బెట్టింగ్ ప్రమోషన్ కాల్ సెంటర్ గురించి కీలకమైన సమాచారం రాబట్టారు. అందులో పనిచేస్తున్న 11 మంది టెలికాలర్స్ అమ్మాయిలను అరెస్ట్ చేసినట్లు పేర్కొన్నారు. వీరిలో ఐదుగురు చైనాకు సంబంధించిన వ్యక్తులు ఉన్నట్లు గుర్తించారు.

## 8న భగవద్గీత శ్లోకాల కంఠస్థ పోటీలు

**ఎంవీపీకాలనీ :** భగవద్గీత శ్లోకాల కంఠస్థ పోటీలు ఈ నెల 8న నిర్వహించనున్నట్లు టీటీడీ ధర్మప్రచార పరిషత్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపింది. భగవద్గీత 6వ అధ్యాయం ఆత్మసంయమ యోగంపై పోటీలను ఎంవీపీ సెక్టార్–8లోని టీటీడీ ఆవరణలో నిర్వహించనున్నారు. 8వ తేదీన చోడవరం ప్రేమ సమాజంలో, 10వ తేదీన పాడేరు బీవీకే స్కూల్‌లో పోటీలు జరుగుతాయన్నారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేయనున్నారు. ఆసక్తి గల విద్యార్థులు పూర్తి వివరాలకు 97031 47716, 85006 41729 నంబర్లలో సంప్రదించాలన్నారు.

## నిర్ణీత సమయంలో వినతులకు పరిష్కారం



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్, జేసీ మయూర్ అశోక్, డీఆర్‌వో భవానీశంకర్

**మహారాణిపేట :** ప్రజల నుంచి వచ్చే వినతులకు సంతృప్తికర స్థాయిలో పరిష్కారం చూపాలని కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ముందుగా గత వారం ప్రజల నుంచి వచ్చిన వినతులపై అధికారులు తీసుకున్న చర్యలపై సమీక్షించారు. నిర్ణీత కాలంలో ఫిర్యాదులను పరిష్కరించాలని, మళ్లీ మళ్లీ రాకుండా జాగ్రత్త వహించాలని సూచించారు. అవసరమైతే జిల్లా స్థాయి అధికారులు ఫిర్యాదుదారులతో మాట్లాడాలన్నారు. సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు ప్రజల నుంచి 193 వినతులు అందాయి. వాటిలో రెవెన్యూ విభాగానికి చెందినవి 61, జీవీఎంసీకి చెందినవి 53, పోలీసు శాఖకు సంబంధించి 11, ఇతర శాఖలకు సంబంధించి 68 ఉన్నాయి. కలెక్టర్‌తో పాటు జేసీ కె.మయూర్ అశోక్, డీఆర్వో బీహెచ్ భవానీ శంకర్, ఆర్డీవో పి.శ్రీలేఖ, జీవీఎంసీ ఏడీసీ వర్మ, ఇతర విభాగాల ఉన్నతాధికారులు ప్రజల నుంచి వినతులు స్వీకరించారు.

## జీవీఎంసీ 'పరిష్కార వేదిక'కు 87 వినతులు



ఫిర్యాదులు స్వీకరిస్తున్న మేయర్ హరి వెంకటకుమారి, కమిషనర్ సంపత్‌కుమార్

**డాబాగార్డెన్స్:** జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 87 వినతులు వచ్చాయని నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి తెలిపారు. జీవీఎంసీ పాత సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కమిషనర్ సంపత్‌కుమార్‌తో కలిసి మేయర్ పాల్గొన్నారు. జోన్–1 నుంచి ఒకటి, జోన్–2 నుంచి 20, జోన్–3 నుంచి 11, జోన్–4 నుంచి 8, జోన్–5 నుంచి 11, జోన్–6 నుంచి 6, జోన్–7 నుంచి ఒకటి, జోన్–8 నుంచి 4 రాగా, జీవీఎంసీ ప్రధాన కార్యాలయానికి సంబంధించి 15 ఫిర్యాదులు అందాయని తెలిపారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్లు డి.వి.రమణమూర్తి, ఆర్.సోమన్నారాయణ, ప్రధాన ఇంజనీరు శివప్రసాదరాజు, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్‌కుమార్, సీసీపీ ప్రభాకరరావు, సీపీ మీనాకుమారి, ఏసీపీ హరిదాస్, డీసీ(రెవెన్యూ) శ్రీనివాసరావు, డీపీవో ఎంవీడీ ఫణిరామ్ పాల్గొన్నారు.

## ఫిర్యాదుల పరిష్కారంలో అలసత్వం వద్దు



ఫిర్యాదుదారులతో సీపీ శంఖబ్రత బాగ్చి

**విశాఖ సిటీ:** ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)లో వచ్చిన ఫిర్యాదుల పరిష్కారంలో అలసత్వం వహించవద్దని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి పోలీస్ అధికారులను ఆదేశించారు. సోమవారం పోలీస్ సమావేశ మందిరంలో నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు 77 ఫిర్యాదులు వచ్చాయి. సీపీ స్వయంగా ఫిర్యాదుదారులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. వాటిపై వెంటనే సంబంధిత స్టేషన్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడి సత్వరమే పరిష్కరించాలని చెప్పారు.

# సమయం లేదు గురువర్యా!

- రేపటితో ముగుస్తున్న గడువు
- మందకొడిగా ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటు హక్కు నమోదు
- ఇప్పటి వరకు 6 వేల మంది మాత్రమే దరఖాస్తు
- ఉమ్మడి జిల్లాలో 28 వేలకు పైగా అర్హులైన ఉపాధ్యాయులు
- పే స్లిప్ లింకుతో జంకుతున్న ప్రైవేటు యాజమాన్యాలు

**విశాఖ విద్య:** ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు ఓటు హక్కు నమోదు ప్రక్రియ మందకొడిగా సాగుతోంది. ఉమ్మడి విశాఖ జిల్లాల పరిధిలో 28 వేల మంది అర్హులైన ఉపాధ్యాయులు ఉంటారని అంచనా వేస్తున్నారు. సోమవారం నాటికి 6 వేల మంది మాత్రమే దరఖాస్తు చేసుకున్నట్లు జిల్లా రెవెన్యూ అధికారులు తెలిపారు. ఎన్నికల కమిషన్ షెడ్యూల్ మేరకు బుధవారంతో దరఖాస్తుకు గడువు ముగిస్తుంది. ప్రస్తుతం ఉమ్మడి విశాఖ జిల్లాలో అర్హులైన వారిలో 25 శాతం మంది కూడా ఓటు హక్కు కోసం నమోదు చేసుకోలేదు. ఉత్తరాంధ్రలోని మిగతా జిల్లాల్లో కూడా ఇదే పరిస్థితి ఉన్నట్లు తెలుస్తోంది. దీంతో అప్రమత్తమైన జిల్లా యంత్రాంగం విద్యాశాఖాధికారులతో పాటు, మండల స్థాయిలో తహసీల్దార్లను సైతం దీనిలో భాగస్వామ్యులను చేసింది. మిగిలిన రెండు రోజుల్లో అర్హులైన ఉపాధ్యాయులంతా దరఖాస్తు చేసుకునేలా ఫోకస్ పెట్టాలని ఆయా జిల్లాల కలెక్టర్లు యంత్రాంగానికి దిశ, నిర్దేశం చేసింది.



### ప్రైవేటు టీచర్లకు పే స్లిప్ లింకు

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్యాల పరిధిలో నిర్వహిస్తున్న హైస్కూల్స్, ఇంటర్ కాలేజీలు, హయ్యర్ ఎడ్యుకేషన్ విద్యా సంస్థల్లో పనిచేసే ఉపాధ్యాయులంతా అర్హులే. అయితే 1-1-2018 నుంచి 31-10-2024 మధ్య కాలంలో మూడేళ్ల తప్పనిసరిగా పనిచేసి ఉండాలని ఎన్నికల కమిషన్ నిబంధనలు పెట్టింది. ప్రైవేటు పాఠశాలు, కాలేజీల్లో పనిచేస్తున్న వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసేటప్పుడు పే స్లిప్ కూడా అప్‌లోడ్ చేయాలి. అదే విధంగా ఆరేళ్ల కాలంలో మూడేళ్ల పాటు ఎక్కడ పనిచేశారనేది సంబంధిత యాజమాన్యం ధ్రువీకరించాలి. ఎన్నికల కమిషన్ ఇలాంటి కఠిన నిర్ణయాలతో, తమ విద్యా సంస్థల్లో పనిచేసే ఉపాధ్యాయులకు ధ్రువీకరణ పత్రాల జారీ చేసేందుకు ప్రైవేటు యాజమాన్యాలు వెనుకంజ వేస్తున్నాయి.

### ఓటుకు దూరమవుతున్న ఎయిడెడ్ ఉపాధ్యాయులు

ఎయిడెడ్ యాజమాన్యాల పరిధిలోని కొన్ని స్కూళ్లను ఇటీవల ప్రభుత్వంలో విలీనం చేశారు. దీంతో అక్కడ పనిచేస్తున్న ఉపాధ్యాయులంతా డీఈవో కంట్రోల్‌కు వచ్చేశారు. అయితే ప్రస్తుతం ఓటు హక్కు నమోదుకు ఆరేళ్ల కాలంలో మూడేళ్లు విధుల్లో ఉన్నట్లుగా ధ్రువీకరణ పత్రాలు సమర్పించడం వీరికి సమస్యగా మారింది. ఉత్తరాంధ్ర జిల్లాలో ఇలా 2 వందల మంది వరకు ఉపాధ్యాయులు ఉండగా, వీరంతా నేటికీ ఓటు హక్కుకు దరఖాస్తు చేసుకోలేదు. సర్వీసు రిజిస్టర్ల ఆధారంగా ఎంఈవో లేదా డిప్యూటీ డీఈవోలు ధ్రువీకరణ పత్రాలు జారీ చేసినట్లైతే తామంతా ఓటు హక్కుకు దరఖాస్తు చేసుకుంటామని విలీన ఉపాధ్యాయులు చెబుతున్నారు.

### ఎమ్మెల్సీ బరిలో..

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ నియోజకవర్గ ప్రస్తుత ఎమ్మెల్సీ రఘువర్మ పదవీ కాలం వచ్చే ఏడాది మార్చితో ముగుస్తోంది. అనంతరం జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో మరోమారు రఘువర్మ పోటీలో నిలువనున్నట్లు ఆయన వర్గీయులు చెబుతున్నారు. ప్రైవేటు పాఠశాల అసోసియేషన్ నుంచి డాక్టర్ సుంకర శ్రీనివాసరావు, విశాఖ ఆర్ఐవోగా పనిచేసి ఉద్యోగ విరమణ చేసిన రాయల సత్యనారాయణ పోటీకి సై అంటూ అప్పుడే ఉత్తరాంధ్ర జిల్లాల్లో ప్రచారం మొదలు పెట్టారు. ఓటు హక్కు నమోదు చేసుకోవాలని ప్రైవేటు స్కూల్స్, కాలేజీల్లో వీరు అవగాహన కూడా కల్పిస్తున్నారు. ఇంకా చాలా మంది ప్రముఖులు పోటీలో నిలబడేందుకు ఉవ్విళ్లూరుతున్నారు. అయితే ఓటరు నమోదు ప్రక్రియ పూర్తయితే, ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ జారీ చేస్తుంది.ఆ తరువాత బరిలో నిలుబడేదెవరనేది స్పష్టత వస్తుంది.

## విశాఖ తీరంలో వాకింగ్ ట్రాక్ నిర్మించాలి

- నగర సీపీ శంఖబ్రత బాగ్చి
- వైజాగ్ మారథాన్ టీషర్టుల ఆవిష్కరణ

**విశాఖ స్పోర్ట్స్ :** విశాఖ సాగర తీరంలో వాకింగ్ ట్రాక్ నిర్మించాల్సిన అవసరం ఉందని నగర పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చి అన్నారు. పొడవైన సాగరతీర మార్గంలో మారథాన్‌లు జరుగుతుండడంతో ఫిట్‌నెస్ సిటీ ఆఫ్ ఇండియాగా ఎదగగలదని ఆశాభావం వ్యక్తం చేశారు. జాగింగ్, వాకింగ్ ట్రాక్ ఆవశ్యకతను కలెక్టర్‌కు, జీవీఎంసీ కమిషనర్‌కు వివరించామన్నారు. డిసెంబర్ 1న వైజాగ్ మారథాన్ నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా టీషర్ట్‌లను సోమవారం ఆవిష్కరించారు. హాఫ్ మారథాన్ (21 కి.మీ.), 10 కి.మీ., 5 కి.మీ. పరుగును నిర్వహించనున్నారు. విజేతలకు రూ. 5 లక్షల ప్రోత్సాహకాలను అందిస్తామన్నారు. మార థాన్‌లో పాల్గొనేవారు vizagmarathon.runలో నమోదు చేసుకోవచ్చన్నారు. 15లోగా నమోదు చేసుకునేవారికి డిస్కౌంట్ ఇస్తామన్నారు. నిర్వాహక కమిటీ ప్రతినిధులు బాలకృష్ణ, శ్రీనివాస్, ఆనంద్, రామచంద్ర, శ్రీప్రకాష్, సంపతి పాల్గొన్నారు.



వైజాగ్ మారథాన్ టీ షర్ట్‌ను ఆవిష్కరిస్తున్న సీపీ శంఖబ్రత బాగ్చి, నిర్వాహక బృందం

## క్లుప్తంగా

### రాష్ట్ర ఉమెన్ క్రికెట్ జట్టులో తోటగరువు విద్యార్థి


విద్యార్థి మౌనిక

అరిలోవ: బీసీసీఐ అమ్మాయిల అండర్–15 జట్టుకు ఆరిలోవ ప్రాంతం తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి గంటా మౌనిక ఎంపికైంది. మౌనిక ప్రస్తుతం 9వ తరగతి చదువుతోంది. ఈ నెల 21న కటక్‌లో జరగనున్న బీసీసీఐ ఉమెన్ అండర్–15 వన్‌డే క్రికెట్ టోర్నమెంట్‌లో ఆంధ్రప్రదేశ్ జట్టు తరపున ఆడనుంది. దీంతో ఆమె తల్లిదండ్రులు, కోచ్‌లు, పాఠశాల ఉపాధ్యాయులు ఆనందం వ్యక్తం చేశారు. సోమవారం పాఠశాలలో మౌనికను ఉపాధ్యాయులు, స్థానిక పెద్దలు అభినందించారు. పాఠశాల విద్యార్థి క్రికెట్ పోటీలలో రాష్ట్రం తరపున ప్రాతినిధ్యం వహించడం అభినందనీయమని ప్రధానోపాధ్యాయురాలు భవాని అన్నారు. మరికొద్ది రోజుల పాటు కోచ్‌ల వద్ద మౌనిక తర్ఫీదు పొంది, అనంతరం కటక్ బయలుదేరనుందని పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు వి.శ్రీనివాసరావు తెలిపారు.

### ఏయూ అంతర కళాశాలల కరాటే జట్టు ఎంపిక

విశాఖ స్పోర్ట్స్: ఏయూ అంతర కళాశాలల కరాటే పోటీలు, జట్టు ఎంపికలు సోమవారం ప్రారంభమయ్యాయి. జిమ్నాజియంలో ఈ పోటీలను ఏయూ వీసీ ఆచార్య శశిభూషణరావు ప్రారంభించారు. ఈ పోటీల్లో ప్రతిభ చూపిన క్రీడాకారులను మెన్, వుమెన్ ఏయూ జట్టుగా ఎంపిక చేసి భోపాల్‌లో జరిగే పోటీలకు పంపనున్నారు. కార్యక్రమంలో ఏయూ వ్యాయామవిభాగ సంచాలకుడు విజయ్‌మోహన్, హెచ్.ఎ.పల్లవి పాల్గొన్నారు.

### విద్యాశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ మృతి


లక్ష్మణరావు

విశాఖ విద్య: జిల్లా విద్యాశాఖలో అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న జి.లక్ష్మణరావు సోమవారం మృతి చెందారు. కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న సమయంలో ఒక్కసారిగా కుప్పకూలిపోగా అతడిని.. సిబ్బంది హుటాహుటిన నగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. అయితే అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు వెల్లడించినట్లు డీఈవో కార్యాలయ సిబ్బంది తెలిపారు. లక్ష్మణరావు కొంతకాలం ఇన్‌చార్జి డీఈవోగా బాధ్యతలు నిర్వహించారు. ఉపాధ్యాయుల సర్వీసుపరమైన వ్యవహారాలు చూసే ఆయన అందరితోనూ ఎంతో సౌమ్యంగా ఉండేవారు. లక్ష్మణరావు భార్య జిల్లాలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తోంది. ఆయన డీఈవో ప్రమోషన్ రేసులో ఉన్నారు. లక్ష్మణరావు మృతికి జిల్లా విద్యాశాఖ అధికారులు, సిబ్బంది సంతాపం తెలిపారు.


పోస్టుకార్డులు పట్టుకుని నిరసన తెలుపుతున్న వలంటీర్లు

# గాల్లో వలంటీర్లు

## కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత దిక్కుతోచని స్థితి

- రూ.10వేల గౌరవ వేతనం హామీకి తిలోదకాలు
- అన్ని వాట్సాప్ గ్రూపుల నుంచి వలంటీర్లు తొలగింపు
- రోడ్డున పడ్డ 11 వేల కుటుంబాలు

మహారాణిపేట: పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వ సేవలను ప్రజలకు చేరువచేయడంలో కీలకంగా వ్యవహరించిన వలంటీర్ల భవిష్యత్తు అగమ్యగోచరంగా మారింది. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత వలంటీర్లు గాలిలో కొట్టుమిట్టాడుతున్నారు. ఐదు నెలలుగా వారికి జీతం/గౌరవ వేతనం చెల్లించడం లేదు. సార్వత్రిక ఎన్నికల ముందు రూ.10వేల గౌరవ వేతనం ఇస్తామని చంద్రబాబు, కూటమి నేతలు ఇచ్చిన హామీని తుంగలో తొక్కేశారు. తాజాగా అన్ని వాట్సాప్ గ్రూపుల నుంచి వలంటీర్లను తొలగించాలని ప్రభుత్వం నుంచి అధికారిక ఉత్తర్వులు వెలువడ్డాయి. దీంతో జిల్లా యంత్రాంగం అధికార వాట్సాప్ గ్రూపుల నుంచి వారిని తొలగిస్తోంది. కూటమి ప్రభుత్వం నమ్మించి మోసం చేయడంతో అర్బన్, గ్రామీణ ప్రాంతాల్లోని వలంటీర్లు నైరాశ్యంలో కొట్టుమిట్టాడుతున్నారు.

2019లో ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన తర్వాత ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను చేరువచేయడానికి వలంటీర్ వ్యవస్థను తీసుకొచ్చారు. జీవీఎంసీ, గ్రామీణ ప్రాంతాల్లో కలిపి మొత్తం 607 సచివాలయాల్లో 11,122 మందిని నియమించారు. అయితే సార్వత్రిక ఎన్నికల ముందు 1,040 మంది వలంటీర్లు రాజీనామా చేశారు. 64 మందిని వివిధ కారణాలతో తొలగించారు. ప్రస్తుతం జిల్లాలో మొత్తం 10,018 మంది ఉన్నారు.

**వాట్సాప్ గ్రూపుల నుంచి తొలగింపు**

గత ప్రభుత్వ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన అన్ని సంక్షేమ పథకాలను ప్రజలకు అందించడానికి వలంటీర్లు ఎంతో కృషి చేశారు. ఈ ఏడాది జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టింది. రెండు నెలల వరకు వలంటీర్లకు ఎలాంటి ఢోకా లేదని ప్రకటనలు వెలువడినప్పటికీ వారికి ఎటువంటి బాధ్యతలు అప్పగించలేదు. ఇటీవల అకస్మాత్తుగా ప్రభుత్వానికి చెందిన అన్ని వాట్సాప్, టెలిగ్రాం తదితర గ్రూపుల నుంచి వలంటీర్లను తొలగించాలని గ్రామ/వార్డు సచివాలయ శాఖ డైరెక్టర్ శివప్రసాద్ అన్ని జిల్లాల కలెక్టర్లను ఆదేశించారు. ఈ ఆదేశాలు తక్షణం క్షేత్రస్థాయిలో అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. దీంతో జిల్లా యంత్రాంగం రెండు రోజుల నుంచి ఇదే పనిలో నిమగ్నమైంది. అన్ని శాఖల అధికారులు వలంటీర్లను ఆయా గ్రూప్‌ల నుంచి తొలగిస్తున్నారు. అలాగే వలంటీర్ల గ్రూపుల నుంచి ప్రజలు బయటకు రావాలని అధికారులు సూచిస్తున్నారు. ఇందుకోసం సచివాల య సిబ్బందిని అప్రమత్తం చేసి.. వలంటీర్ల గ్రూపు నుంచి ప్రజలు బయటకు వచ్చేలా ఒత్తిడి చేస్తున్నారు.

### 6న భారీ నిరసనకు సన్నాహాలు

సార్వత్రిక ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన తర్వాత వలంటీర్ల నుంచి మొబైల్ ఫోన్లు, సిమ్ కార్డులు తీసుకున్నారు. ఆ తర్వాత ఫోన్లు, సిమ్ కార్డులు ఎవరికీ తిరిగి ఇవ్వలేదు. జిల్లాలో వలంటీర్లకు మే వరకు గౌరవ వేతనం ఇచ్చారు. ఆ తర్వాత ఎన్నికల కారణంగా వలంటీర్లను విధులకు దూరం ఉంచారు. కాగా.. తమను కొనసాగించాలంటూ వలంటీర్లు పలు రకాలుగా ఉద్యమాలు చేస్తున్నారు. తొలుత కలెక్టర్, ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులను కలిసి వినతి పత్రాలు సమర్పించారు. పోస్టు కార్డు ఉద్యమం చేపట్టారు. కలెక్టర్ కార్యాలయం, జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ధర్నాలు నిర్వహించారు. అమరావతిలో నిరసన ప్రదర్శనలు చేపట్టారు. ఈ నెల 6న భారీ ప్రదర్శన చేపట్టడానికి వలంటీర్లు సన్నాహాలు చేస్తున్నారు.

### ఉద్యోగ భద్రత కల్పించాలి



ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం వలంటీర్లకు రూ.10వేల జీతం ఇవ్వాలి. రాజీనామా చేసిన వలంటీర్లను తిరిగి విధుల్లోకి తీసుకోవాలి. మాకు ఎలాంటి రాజకీయాలు తెలియవు. ప్రభుత్వ పథకాలను ప్రజల వద్దకు తీసుకెళ్లడంలో కీలకంగా వ్యవహరించాం. పేదల అభ్యున్నతికి పనిచేసిన మాకు ఉద్యోగ భద్రత కల్పించాలి. అవినీతికి ఆస్కారం లేకుండా పనిచేసిన మమ్మల్ని ఆదుకోవాలి.

– జగదీష్, వలంటీర్, మధురవాడ

### కష్టపడి పనిచేశాం



ఐదేళ్లు కష్టపడి విధులు నిర్వహించాం. కరోనా సమయంలో ప్రాణాలకు తెగించి పనిచేశాం. ఆ సమయంలో ఎంతో మంది వలంటీర్లు కరోనాకు బలయ్యారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఐదు నెలలు గడిచినా వలంటీర్ వ్యవస్థపై సరైన నిర్ణయం వెల్లడించలేదు. మాకు ఎలాంటి విధులు, బాధ్యతలు అప్పగించలేదు. నయాపైసా కూడా గౌరవ వేతనం చెల్లించలేదు. నిత్యం పేద ప్రజలతో సంబంధాలు కలిగిన వలంటీర్ల వ్యవస్థపై సరైన నిర్ణయం తీసుకుంటారని ఎదురుచూస్తున్నాం.

–సంపత్, జ్ఞానాపురం

### ఆచార్య సిమ్మన్నకు జ్ఞానజ్యోతి పురస్కారం


ఆచార్య వెలమల సిమ్మన్న

ఎంవీపీకాలనీ: ఆంధ్రవిశ్వవిద్యాలయం పూర్వ ఆచార్యుడు ఆచార్య వెలమల సిమ్మన్నకు అరుదైన గౌరవం లభించింది. రచయితలు ప్రతిష్టాత్మకంగా భావించే జ్ఞానజ్యోతి పురస్కారం ఆయన్ని వరించింది. 2024 సంవత్సరానికి గాను ఈ పురస్కారానికి ఆయన్ని ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం ఎంపిక చేసింది. 57వ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా ఈ నెల 17న విజయవాడ మహాత్మగాంధీరోడ్‌లోని ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో నిర్వహించే కార్యక్రమంలో ఆచార్య సిమ్మన్న ఈ పురస్కారాన్ని అందుకోనున్నారు. తెలుగు సాహితీ రంగానికి ఆయన చేసిన కృషికి గాను ఈ పురస్కారానికి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా పలువురు రచయితలు, విద్యావేత్తలు, ఆచార్యులు ఆయనకు అభినందనలు తెలియజేశారు.

### ఖోఖో చాంపియన్ విశాఖ జట్లు


ప్రథమ స్థానం సాధించిన విశాఖ బాలుర జట్టు

అనకాపల్లి: తుమ్మపాల జిల్లా పరిషత్ హైస్కూల్‌లో మూడు రోజులుగా నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్–17 బాల, బాలికల ఖోఖో పోటీలు సోమవారం రాత్రి ముగిశాయి. రాష్ట్రంలో మొత్తం 26 జిల్లా నుంచి 44 టీమ్‌లు పాల్గొన్నాయి. ఫైనల్స్ బాలుర విభాగంలో విశాఖ–ప్రకాశం జిల్లాల మ ధ్య జరిగిన పోటీ లో విశాఖ జిల్లా జట్టు ప్రథమ స్థానం సాధించగా, బాలికల విభాగంలో విశాఖ–నెల్లూరు జిల్లాల మధ్య జరగగా.. విశాఖ బాలికల జట్టు ప్రథమ స్థానంలో నిలిచింది. విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి నాగేశ్వరరావు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# అందరికీ సారీ..

- వ్యాపారంలో నష్టాల వల్లే చనిపోతున్నా..
- సెల్ఫీ వీడియోలో కూల్ జోన్ అధినేత వెల్లడి

విశాఖ సిటీ: వ్యాపారంలో నష్టాల వల్లే ఆత్మహత్యకు పాల్పడినట్లు కూల్ జోన్ అధినేత కొవ్వూరు సాయి గణేష్ సెల్ఫీ వీడియోలో పేర్కొన్నాడు. శనివారం అర్ధరాత్రి మధురవాడలోని ఒక హోటల్‌లో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన విషయం తెలిసిందే. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తుండగా అయన మొబైల్‌లో ఆత్మహత్యకు ముందు తీసుకున్న సెల్ఫీ వీడియో వెలుగులోకి వచ్చింది. వ్యాపారంలో ఇబ్బందులు పడుతున్నానని.. తనను నమ్ముకొని 100 కుటుంబాలు బతుకుతున్నాయని.. వాళ్లకు సమాధానం చెప్పలేకపోతున్నానని వాపోయాడు. బాగా చదువుకోవాలని ఇద్దరు కుమార్తెలను.. పిల్లలను బాగా చూసుకోవాలని భార్యకు జాగ్రత్తలు చెప్పాడు. అందర్నీ చూసుకోవాలని అన్నయ్యను కోరాడు. కుటుంబ సభ్యులకు, స్టాఫ్‌కు క్షమాపణ చెప్పాడు.

### వినికిడి సమస్యపై 7న ఉచిత వైద్య శిబిరం

మహారాణిపేట: వినికిడి సమస్యతో బాధపడుతున్న వారికి 7వ తేదీ ఉదయం 10 గంటలకు విశాఖలో పలు ఆస్పత్రుల్లో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు తెలిపారు. కేజీహెచ్, ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఈ శిబిరం జరుగుతుందన్నారు. దీన్ దయాల్ శ్రావణ ఫౌండేషన్ ద్వారా ఉచిత పరికరాలు పంపిణీ కోసం ఈ శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. క్యాంపునకు వచ్చే వారు ఆధార్ కార్డు, రేషన్‌కార్డు, సదరన్ సర్టిఫికెట్, రెండు పాస్ ఫొటోలు, గతంలో వినికిడి పరీక్ష చేయించుకుంటే ఆడియోగ్రాఫ్ రిపోర్ట్ తీసుకురావాలని డీఎంహెచ్‌వో కోరారు.

### పెండింగ్ జీతాల కోసం రోడ్డెక్కిన ఆయాలు



కలెక్టరేట్ పోలీసులతో ఆయాలు, కుకింగ్ హెల్పర్ల వాగ్వాదం

మహారాణిపేట: పెండింగ్ జీతాలు వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వ పాఠశాల్లో పనిచేస్తున్న ఆయాలు, కుకింగ్ హెల్పర్లు, కార్మికులకు ఆందోళన నిర్వహించారు. వీరంతా సోమవారం కలెక్టరేట్‌లో వెళ్లేందుకు యత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా ఆందోళనకారులకు, పోలీసులకు మధ్య వాగ్వాదం జరిగింది. లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించిన పలువుర్ని పోలీసులు అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా కార్మికులు నినాదాలు చేశారు. స్కూలు ఆయాలకు రూ.15 వేలు, కుకింగ్ హెల్పర్లకు రూ.10 వేలు జీతం ఇవ్వాలని కలెక్టర్‌కు సమర్పించిన వినతి పత్రంలో పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ యునైటెడ్ స్కూల్స్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం జరిగింది.

### ప్రపంచ రికార్డుకు సిద్ధమవుతున్న శ్రీ చైతన్య విద్యార్థులు

విశాఖ విద్య: బాల మేధావుల ప్రపంచ రికార్డును కైవసం చేసుకునేందుకు తమ విద్యార్థులు సన్నద్ధమౌతున్నట్లు శ్రీ చైతన్యవిద్యా సంస్థల నిర్వాహకులు సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 10 వేల మంది విద్యార్థులు 600 మ్యాథ్స్ ఫార్ములాలు ఏకకాలంలో పఠిస్తూ ప్రపంచ రికార్డు నెలకొల్పేందుకు సిద్ధంగా ఉన్నారని పేర్కొంది. 39 ఏళ్ల క్రితం ప్రారంభమైన శ్రీ చైతన్య విద్యా సంస్థల ప్రస్థానం సామాన్య విద్యార్థులను సైతం విశ్వ విజేతలుగా తీర్చిదిద్దినట్లు నిర్వాహకులు తెలిపారు. ఐఐటీ, జేఈఈ, నీట్, ఒలింపియాడ్ వంటి జాతీయ, అంతర్జాతీయ పోటీపరీక్షల్లో శ్రీ చైతన్య విద్యార్థులే నంబర్ వన్ స్థానంలో నిలుస్తున్నారని వెల్లడించారు. ప్రపంచ రికార్డు ఫీట్‌లో పాల్గొంటున్న బాల మేధావులందరికీ సంస్థ తరుపున అభినందనలు తెలిపారు.

# 'కార్ట్'తో క్యాన్సర్‌కు చెక్



మహారాణిపేట: అపోలో ఆస్పత్రిలో క్యాన్సర్ చికిత్స కోసం సీఏఆర్–టీ (కార్ట్) సెల్ థెరపీని అందుబాటులోకి తెచ్చింది. సంప్రదాయ చికిత్సలు విఫలమైనప్పుడు ఈ థెరపీని ఉపయోగిస్తారు. కఠినమైన రక్త క్యాన్సర్‌కు విప్లవాత్మక చికిత్సగా దీనిని పరిగణించవచ్చు. ఆధునిక సెల్యులార్ థెరపీని ఇమ్యూనో యాక్ట్ భాగస్వామ్యంతో అపోలో ఆస్పత్రిలో అందుబాటులో తీసుకొచ్చింది. ఈ సందర్భంగా విశాఖ అపోలోలో క్యాన్సర్ సెంటర్స్ సీనియర్ కన్సల్టెంట్ మెడికల్ అంకాలజీ డాక్టర్ రాకేష్ రెడ్డి బోయా మాట్లాడుతూ బ్లడ్ క్యాన్సర్ చికిత్సలో ఇది ఒక విప్లవాత్మక చర్యగా పేర్కొన్నారు. సీఏఆర్–టీ సెల్ థెరపీ ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖ అపోలో క్యాన్సర్ సెంటర్స్‌లో అందుబాటులో ఉందన్నారు.

**సెల్యూలార్ థెరపీ అంటే...**

క్యాన్సర్ వ్యాధి బారిన పడుతున్న వారి సంఖ్య రోజురోజుకీ పెరుగుతోంది. వీరికి తక్కువ ధరల్లో సమర్థవంతమైన చికిత్స అందించడానికి శాస్త్రవేత్తలు నిత్యం కృషి చేస్తున్నారు. ఇందులో భాగంగా కొత్త క్యాన్సర్ థెరపీని అభివృద్ధి చేసింది. ఇది ఒక రకమైన సీఏఆర్–టీ సెల్ థెరపీని అందుబాటులో తెచ్చింది. కార్ట్ థెరపీతో క్యాన్సర్‌కు చికిత్సకు కొత్త మార్గంగా చెప్పుకోవచ్చు. ఇది క్యాన్సర్‌తో పోరాడటానికి రోగి సొంత రోగనిరోధక కణాలను అభివృద్ధి చేస్తుంది.

**థెరపీ ఎలా తీసుకోవాలి?**

కార్ట్ సెల్ థెరపీని పొందడానికి ముందుగా, డాక్టర్లు రోగి చేతి నుంచి కొంత రక్తాన్ని తీసుకొని దాని నుంచి టీ–సెల్స్ వేరు చేస్తారు. టీ–సెల్స్ ల్యాబ్‌కు పంపి కార్ట్–సెల్స్‌గా మార్చుతారు. ల్యాబ్‌లో రోగి చికిత్సకు సరిపడేంత వరకు కొన్ని వారాల పాటు కార్ట్ –సెల్స్ వృద్ధి చేసి, మళ్లీష్టై చేస్తారు. వైద్యులు రోగికి రోగనిరోధక శక్తిని తగ్గించడానికి కొన్ని కీమో థెరపీ మందులు ఇస్తారు. కార్ట్ సెల్స్ రక్తంలో ప్రయాణిస్తూ క్యాన్సర్ కణాల వెతికి మరీ చంపేస్తాయి. రోగికి కనీసం వారం నుంచి 15 రోజుల వరకు చికిత్స అందిస్తామని అపోలో వైద్యులు తెలిపారు.

**లక్షణాలు ఇవి..**

కార్ట్ థెరపీ తీసుకున్న తరువాత రోగిని చాలా నిశితంగా పరిశీలించాల్సి ఉంటుంది. థెరపీ తీసుకున్న తరువాత రోగికి అధిక జ్వరం, చలి, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, తీవ్రమైన వికారం, వాంతులు, అతిసారం, వేగవంతమైన హృదయ స్పందన ఉంటాయి. కార్ట్ థెరపీ సమాచారం తెలుసుకోవాలంటే ఈ నంబర్లకు 9963980259/9985310069 సంప్రదించాలని ఆస్పత్రి నిర్వాహకులు కోరారు.

## మొక్కలకు వీల్ చైర్లు.. దివ్యాంగులకు అపసోపాలు


దివ్యాంగులు, వృద్ధుల కోసం ఏర్పాటు చేసిన వీల్ చైర్‌లో మొక్కలను తరలిస్తున్న సిబ్బంది



కలెక్టరేట్‌లో ఇబ్బందులు పడుతున్న దివ్యాంగులు

మహారాణిపేట: ప్రభుత్వం మారగానే దివ్యాంగులకు కల్పించే సౌకర్యాలు దూరమయ్యాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక అధికారుల తీరులో మార్పు వచ్చింది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ప్రతి సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో వృద్ధులు, దివ్యాంగులు ఇబ్బందులు పడకూడదని కలెక్టర్ కార్యాలయంలో వీల్ చైర్లు, లిఫ్ట్ అందుబాటులోకి తీసుకొచ్చింది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత వీల్‌చైర్లు దివ్యాంగులకు దూరమయ్యాయి. ప్రస్తుతం ఆ వీల్‌చైర్లు కలెక్టరేట్‌లో మొక్కలు తరలింపు, సంరక్షణకు ఉపయోగిస్తున్నారు. దీంతో ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో వినతులు అందజేయడానికి వచ్చే దివ్యాంగులు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మెట్లు ఎక్కలేక అపసోపాలు పడుతున్నారు.

# సమ్మోహనం.. శ్రీకృష్ణ లీలలు


అద్భుత నృత్య రూపకం

మద్దిలపాలెం: కూచిపూడి నృత్యనాటకం సమ్మోహనభరితంగా సాగింది. నటరాజ్ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ 24వ వార్షికోత్సవం సోమవారం కళాభారతి ఆడిటోరియంలో నిర్వహించారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని సంస్థ ప్రిన్సిపాల్ 'నాట్యశ్రీ' కేవీ లక్ష్మి నృత్య పర్యవేక్షణలో విద్యార్థినులు రసవత్తరంగా ప్రదర్శించిన 'శ్రీ కృష్ణ కథా నృత్యకేళి' ఆబాల గోపాలాన్ని అలరించింది. నంది పురస్కార గ్రహీత భారతీ భూషణ రాంభట్ల నృసింహ శర్మ ఈ కథాంశం గంటన్నర నిడివిలో శ్రీ కృష్ణుడి జననం నుంచి మధుర వెళ్లి కంసుడ్ని వధించడం వరకూ ఉన్న కీలక ఘట్టాలను సాక్షాత్కరింపజేశారు. కూచిపూడి అగ్రహారంలో భాగవతుల సంప్రదాయాన్ని అనుసరించి గణపతి స్తుతి అంశంతో ప్రదర్శనకు శ్రీకారం చుట్టారు. గానలోల.. అంటూ సాగే గీతానికి రసరమ్యభావాలొలికించే గోపికలు లయబద్ధంగా నృత్యం ప్రదర్శించారు. దేవకి రంగ ప్రవేశం ఆ తర్వాత పసిపిల్లల్ని పైశాచికంగా వధించిన విధానాన్ని తెలుసుకుని ఆమె హృదయం తల్లడిల్లిపోతుంది. వసుదేవుడు పసిబిడ్డను చాకచక్యంగా నందుడికి అప్పగించే కథనం.. చెరసాల నుంచి గోకులంకు వెళ్లడం.. అక్కడ ఆటపాటలతో వెన్నదొంగ, చిలిపి చేష్టలతో గోపికలను ఆటపట్టించడాలు భలే ముచ్చట గొలిపాయి. పసితనంలో స్తన్యమివ్వడానికి పాలతల్లిలా మారువేషంలో వచ్చిన పూతన సంహారంలో కృష్ణలీలల పర్వం గగుర్పాటుకు గురిచేసింది. కళింగమథనం, గోవర్థనగిరిని చిటికెనవేలితో అమాంతం ఎత్తడం, మధుర వెళ్లడం, కంసుణ్ణి వధించడంతో కథ సుఖాంతమవుతుంది.. ఇదీ టూకీగా శ్రీ క్రిష్ణ కథాకేళి. ఇందులో చిన్ని కృష్ణుడిగా ఈశా, యశోదగా భాగ్యశ్రీ బత్తిన సన్నివేశాలను రక్తికట్టించారు. కృష్ణుడిగా తేజశ్రీ బత్తిన అద్భుతమైన పాత్రపోషణం, రాధగా మౌనిక కట్టా నటన, వీరిద్దరి మధ్యా ప్రణయ సన్నివేశాల భలే రక్తికట్టాయి. కంసుడిగా, కాళింగుడిగా హారికా రెడ్డి ద్విపాత్రాభినయం చేశారు. పూతన పాత్రకు శాంతి న్యాయం చేశారు. కేవీ లక్ష్మి నృత్యపరికల్పన, ఆయువుపట్టు వంటి దర్శకత్వ పటిమకు ప్రేక్షకులు నీరాజనం పలికారు. ఎన్ఎండీపీ వ్యవస్థాపక అధ్యక్షుడు బత్తిన రంగ విక్రమ్ కుమార్ (గౌడ్), కూచిపూడి నాట్యకళాకారిణి గీతా నారాయన్, నాట్యాచారిణి కేవీ లక్ష్మి పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ముంబై వాసి దుర్మరణం


షిజి పుయత్(ఫైల్)


సంఘటనా స్థలిలో షిజి పుయత్ మృతదేహం

అక్కిరెడ్డిపాలెం: విధులకు వెళ్తున్న ముంబైకి చెందిన వ్యక్తి రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందాడు. గాజువాక ట్రాఫిక్ సీఐ కోటేశ్వరరావు తెలిపిన వివరాలు. ముంబైకి చెందిన షిజి పుయత్(45) మల్కాపురంలోని శ్రీహరిపురంలో ఉంటూ, ఆటోనగర్‌లోని శ్రీసాయి కాలిబ్రిషన్ అనే ప్రైవేట్ కంపెనీలో ఇంజినీర్‌గా పనిచేస్తున్నాడు. సోమవారం ఉదయం స్కూటీపై విధులకు బయల్దేరాడు. గాజువాకలో మోహిని థియేటర్ వద్ద ఆర్టీసీ బస్సుకు ఆవు అడ్డురావడంతో బస్సును డివైడర్ వైపు డ్రైవర్ తిప్పాడు. అదే సమయంలో బస్సుకు, డివైడర్‌కు మధ్యనున్న ఖాళీ నుంచి బస్సు దాటేందుకు పుయత్ ప్రయత్నించాడు. బస్సు ఒక్కసారిగా డివైడర్ వైపు మళ్లడంతో స్కూటీ బస్సుకు తగిలి, వాహనంతో సహా వెనుక చక్రాల కిందికి వెళ్లిపోయాడు. తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మరణించాడు. సమాచారం అందుకున్న గాజువాక ట్రాఫిక్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. ప్రమాదానికి కారణమైన బస్సు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని బస్సును స్టేషన్‌కు తరలించారు. మృతుని భార్య రేష్మా పుయత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వెల్లడించారు. మృతునికి ఓ కుమార్తె, వృద్ధులైన తల్లిదండ్రులు ఉన్నారు.

## అనారోగ్యంతో బీఎస్ఎఫ్ జవాన్ మృతి

**నరవలో అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు**


బీఎస్ఎఫ్ జవాన్ అప్పలనాయుడు(ఫైల్)


అప్పలనాయుడు పార్థివ దేహానికి గౌరవ వందనం సమర్పిస్తున్న బీఎస్ఎఫ్ దళం

పెందుర్తి: జీవీఎంసీ 88వ వార్డు నరవ గ్రామానికి చెందిన బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్(బీఎస్ఎఫ్) జవాన్ తిలారి అప్పలనాయుడు(45) అనారోగ్యంతో మరణించారు. బీఎస్ఎఫ్ గౌహతి 17వ బెటాలియన్‌కి చెందిన అప్పలనాయుడు కొద్ది రోజుల క్రితం అక్కడే అనారోగ్యానికి గురయ్యారు. చికిత్స పొందుతూ ఈ నెల1న మృతి చెందారు. అప్పలనాయుడు పార్థివదేహాన్ని ఆదివారం సాయంత్రం సైనిక విమానంలో విశాఖ విమానాశ్రయానికి తెచ్చి, అక్కడి నుంచి నరవ తరలించారు. అనంతరం సైనిక లాంఛనాలతో అప్పలనాయుడు మృతదేహానికి గౌరవ వందనం సమర్పించారు. దేశానికి ఆయన అందించిన సేవలకు గుర్తుగా జాతీయ జెండాను పార్థివదేహంపై ఉంచి గౌరవించారు. అనంతరం ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు జరిపారు. సోమవారం స్థానిక బీఎస్ఎఫ్ అధికారులు అప్పలనాయుడు కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు.

## ఉత్సాహంగా నెట్‌బాల్ పోటీలు


కణితి జట్టుకు కప్ అందిస్తున్న సన్ స్కూల్ డైరెక్టర్ శ్రీనివాసరావు

భీమునిపట్నం: భీమిలి సమీపంలోని కీతిన్‌పేట సన్ స్కూల్ వద్ద సోమవారం ఉమ్మడి విశాఖ జిల్లాల నెట్‌బాల్ పోటీలు ఉత్సాహంగా జరిగాయి. 17 ఏళ్లలోపు బాల, బాలికలకు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జిల్లా పీఈటీ సంఘ కార్యదర్శి, నెట్‌బాల్ పోటీల ఇన్‌చార్జి లలిత్‌కుమార్ పర్యవేక్షణలో పోటీలు జరగాయి. 200 విద్యార్థులు పాల్గొన్నారు. బాలుర విభాగంలో మధురవాడకు చెందిన గ్లోబల్ పాఠశాల ప్రథమ స్థానంలో నిలవగా.. ద్వితీయ స్థానంలో నుడుపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ద్వితీయ, ఉక్కునగరం సృష్టి వరల్డ్ స్కూల్ నిలిచాయి. బాలికల విభాగంలో కణితి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రథమ స్థానంలో నిలవగా, మధురవాడ గ్లోబ్ స్కూల్ ద్వితీయం, నడుపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తృతీయ స్థానంలో నిలిచాయి. గెలుపొందిన జట్లకు సన్ స్కూల్ డైరెక్టర్ కైపతపల్లి శ్రీనివాసరావు కప్‌లను అందించారు. ఇక్కడ గెలుపొందిన జట్లు త్వరలో నెల్లూరు, చిత్తూరులో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారు.

## అవినీతి రహిత సమాజానికి పౌరుల భాగస్వామ్యం అవసరం


మాట్లాడుతున్న సీబీఐ ఎస్పీ మురళీ రాంభా

విశాఖ సిటీ: సత్యనిష్ఠ, పారదర్శకత, అవినీతి రహిత సమాజం సృష్టించడం ద్వారా భారత దేశ స్థాయిని ప్రపంచ స్థాయికి తీసుకెళ్లడంలో ప్రతి పౌరుడి భాగస్వామ్యం అవసరమని సీబీఐ ఎస్పీ మురళీ రాంభా పేర్కొన్నారు. విశాఖ పోర్టు అథారిటీ, డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(డీసీఐ) ఆధ్వర్యంలో గత నెల 28 నుంచి నిర్వహించిన విజిలెన్స్ వారోత్సవాలు సోమవారంతో ముగిశాయి. ఈ ముగింపు వేడుకలను పోర్టు పరిపాలన భవనంలోని సాంబమూర్తి ఆడిటోరియంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీబీఐ ఎస్పీ మురళీ రాంభా విజిలెన్స్ అవగాహన వారోత్సవాల ప్రాధాన్యతను వివరించారు. వారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన పోటీల్లో విజేతలకు అతిథుల చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ పి.ఎస్.ఎల్.స్వామి, ఇతర పోర్టు ఉన్నతాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.